సాక్షి
నిజామాబాద్

శనివారం। 26। ఏప్రిల్। 2025



ప్లీజ్ ఒక్క క్షణం..

యువత జీవితంలో ఎదురైన సమస్యలకు భయపడి ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. నిరాశ, నిస్పృహలతో ప్రాణాలొదులుతున్నారు.

- IIలో ▸



ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే..

ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
45.4 /23.4

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



ఖలీల్‌వాడి: జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన జీవీఎస్ భరతలక్ష్మిని శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు సముదాయ భవనంలోని జడ్జి చాంబర్‌లో ఆమెకు పూల మొక్కను అందజేశారు. జిల్లా స్థితిగతులపై ఇరువురు చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు అధికార యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

తోట రాజశేఖర్‌కు జాతీయస్థాయి అవార్డు



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి మరోమారు జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ రెడ్‌క్రాస్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. వచ్చే నెల 13న రాష్ట్రపతి భవన్‌లో జరిగే సమావేశంలో ఈ అవార్డును అందుకోనున్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు ఆయనను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని తిలక్ గార్డెన్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఏడీఈ టౌన్–2 ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతి నగర్, గోపాల్ బాగ్, జెజె రెడ్డి హాస్పిటల్, పోచమ్మ గల్లి, ద్వారకా నగర్ తదితర ప్రాంతాల్లో నేడు ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే శిక్షణ



నిజామాబాద్ రూరల్: చిన్నారులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారి మానసిక ఉల్లాసానికి ఇచ్చే శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని డీఈవో అశోక్ పేర్కొన్నారు. బాలభవన్‌లో నిర్వహించే ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలకు శిక్షణ ఆటవిడుపు అన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, యోగా, నాటకం, కర్రసాము తదితర 30 రకాల అంశాలలో తర్ఫీదు తీసుకోవచ్చన్నారు. బాలభవన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మల్లాది ఉమాబాల, రిటైర్డ్ సూపరిండెంట్ విఠల్‌ప్రభాకర్, మెజీషియన్ జాదుయుగంధర్ రంగనాథ్, సిబ్బంది వెంకటలక్ష్మి, పుష్పలత, లక్ష్మణ్, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తిరుగులేని వేముల



ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం వద్ద వేముల ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన మోతె గ్రామం ఉన్న బాల్కొండ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా మూడుసార్లు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు. వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చి బాల్కొండను అభివృద్ధి పథంలో నడిపించారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

- ఉమ్మడి జిల్లా ప్రగతిలో కీలక పాత్ర
- కాళేశ్వరం 20, 21, 21ఏ ప్యాకేజీలు, ఆర్వోబీలు, న్యాక్ భవనాల నిర్మాణం..
- పదేళ్లలో రూ.3 వేల కోట్లతో బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి
- వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికైన ప్రశాంత్‌రెడ్డి
- వేముల ఇరిగేషన్ విధానాలను మెచ్చి రాష్ట్రమంతటా అమలు చేసిన కేసీఆర్

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తండ్రి వేముల సురేందర్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఆయన బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నారు. అంతకు ముందు సురేందర్‌రెడ్డి నిజాం షుగర్స్ చైర్మన్‌గా, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. బీఆర్ఎస్ స్థాపించిన సమయంలో కేసీఆర్‌తో ఉన్న గుప్పెడు మందిలో సురేందర్‌రెడ్డి ఒకరు. ఆయన తుదిశ్వాస విడిచే వరకూ బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో సురేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓటమి చెందగా ఆ సమయంలో ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. తర్వాత 2014, 2019, 2023 లలో వరుసగా బాల్కొండ నుంచి గెలుస్తూ వస్తున్నారు. కేసీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందించారు.





తండ్రి ఆకాంక్షలను నెరవేరుస్తూ..

తండ్రి సురేందర్‌రెడ్డి ఆశయాల మేరకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించే, ఆయకట్టు స్థిరీకరణ చేసే కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి 20, 21, 21ఏ ప్యాకేజీ పనులను మంజూరు చేయించి 70 శాతం పూర్తి చేయించారు. సారంగాపూర్, మెంట్రాజ్‌పల్లి, మంచిప్ప వద్ద పంప్‌హౌస్ పనులు, మెయిన్ పైప్‌లైన్ పనులు 70 శాతం పూర్తి చేయించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు నిర్మింపజేశారు. రూ. 14 కోట్లతో నిజామాబాద్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) భవనాన్ని పూర్తి చేయించారు. మాధవ నగర్, అర్సపల్లి వద్ద ఆర్‌వోబీ కలలను సాకారం చేశారు. మాధవనగర్-కంఠేశ్వర్ డబుల్ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయించారు.

వరదకాలువకు తూములు

శ్రీరాంసాగర్ వరద కాలువకు జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో 16 చోట్ల తూములు ఏర్పాటు చేయించారు. బాల్కొండ నియోజకవర్గంలో 6 చోట్ల తూములున్నాయి. వీటి ద్వారా మొత్తం 45 చెరువులు నిండుతుండగా, బాల్కొండ నియోజకవర్గంలో 18 చెరువులు నిండుతున్నాయి. వీటికి నిర్వహణ ఖర్చు అనేదే లేదు. రూ. 12 కోట్లతో లక్ష్మి కాలువ ఆధునీకీకరణ, రూ. 6 కోట్లతో నవాబ్ ఎత్తిపోతల పథకం, రూ. 12 కోట్లతో నిజాంసాగర్ ఆధునీకీకరణ పనులు చేయించారు. నియోజకవర్గంలో 22 చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ చెక్‌డ్యాములకు తూములను ఏర్పాటు చేయించి పచ్చలనడ్కుడ చెరువును నింపారు. దీంతో సాగుకు సమృద్ధిగా నీరు లభిస్తోంది.

బాల్కొండలో ప్రగతి పరుగులు..

బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం రూ.3 వేల కోట్లతో రాష్ట్రంలోనే అత్యధిక అభివృద్ధి పనులు చేయించారు. కాళేశ్వరం 21ఏ ప్యాకేజీ ద్వారా రూ. 1,400 కోట్లతో 80 వేల ఎకరాలకు నీరందించారు. ఈ ప్యాకేజీ కింద పదేళ్లలో రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. రూ. 600 కోట్ల శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం పనుల్లో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలో రూ. 1,900 కోట్లు ఖర్చు చేశారు. రూ. 200 కోట్లతో 2 చెక్‌డ్యాంలు కట్టించారు. ఈ చెక్‌డ్యాంలు చూసిన కేసీఆర్ రాష్ట్రమంతటా ఇలాంటివి కట్టించారు. రూ. వెయ్యి కోట్లతో 10 ఎత్తిపోతలు నిర్మించారు. రూ. 200 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, రూ. 600 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనలు నిర్మించారు. అన్ని మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. రూ. 300 కోట్లతో నియోజకవర్గంలో ఆస్పత్రులు, కమ్యూనిటీ హాల్స్, సీసీరోడ్లు, పాఠశాలలు, 87 ఆలయాలు నిర్మించారు. 21 సబ్‌స్టేషన్లు, భీంగల్‌లో రూ. 40 కోట్లతో వంద పడకల ఆస్పత్రి కట్టించారు. భీంగల్‌లో బస్‌డిపో, లింబాద్రి గుట్ట అభివృద్ధి, భీంగల్, బాల్కొండలలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించారు.



బాల్కొండ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఏది అడిగినా కేసీఆర్ కాదనలేదు..

గ్రామాల వారీగా సమస్యలు నోట్ చేసుకొని అందుకు అనుగుణంగా బడ్జెట్ మంజూరు చేయించుకున్నా. నేను ఏది అడిగినా కేసీఆర్ కాదనలేదు. చెక్‌డ్యాంలతో వేలాది బోర్లు రీచార్జి అయ్యాయి. కాళేశ్వరం 21వ ప్యాకేజీలో భాగంగా డిస్ట్రిబ్యూటరీ లైన్లు వేయించాం. ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక ఔట్‌లెట్ పాయింట్ వచ్చేలా చూశాం. ఈ నీరు వాగులోకి రావడంతో చెక్‌డ్యాంలు నిండుతున్నాయి. చెరువులూ జలకళ సంతరించుకుంటున్నాయి. – వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే

భూ భారతితో రైతులకు మేలు



సిరికొండలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సిరికొండ / ఇందల్వాయి: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సిరికొండ, ఇందల్వాయి మండలాల్లోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుల్లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు భూ హక్కులపై ఎలాంటి సమస్యలు రాకుండా భూ భారతి చట్టంలో అనేక అంశాలు పొందుపర్చినట్లు తెలిపారు. పైలట్ గ్రామాల్లో అమలు తర్వాత జిల్లాలోని ఒక మండలంలో ప్రయోగాత్మకంగా భూ భారతిని అమలు చేసి రైతుల నుంచి సూచనలు స్వీకరించి రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ప్రతీ రైతుకు భూధార్ కార్డులు అందుతాయన్నారు. ధరణితో ఎదురైన సమస్యకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. చట్టంలోని అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ వెంకట్ రావు, పీఏసీఎస్ చైర్మన్లు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ ముత్తెన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామాకు మోక్షం

- భూ భారతిలో చట్టబద్ధత కల్పించే ఆప్షన్
- జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 25,345 దరఖాస్తులు

మోర్తాడ్(బాల్కొండ): తెల్లకాగితాలపై రాసుకున్న భూ విక్రయ ఒప్పంద పత్రాలకు భూ భారతి ద్వారా మోక్షం లభించనుంది. గత ప్రభుత్వం 2020లో సాదాబైనామాలకు దరఖాస్తులు సేకరించినా 2019 రెవెన్యూ చట్టం ప్రకారం పట్టాల జారీ సాధ్యం కాలేదు. ధరణి పోర్టల్‌లో ఆప్షన్ ఇచ్చినా చట్టంలో ఉన్న చిక్కులతో అదీ సాధ్యం కాలేదు. తాజాగా భూ భారతిలో మాత్రం ప్రత్యేక ఆప్షన్ ఇవ్వనుండడంతో ఇప్పటి వరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 25,345 దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం ఉంది.

పట్టా భూములకే అవకాశం

పట్టా భూములకు సంబంధించి సాదాబైనామాలు ఉంటేనే ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వనుంది. గతంలో పీవోటీ(అసైన్డ్) భూములకు పట్టాలను జారీ చేశారు. ఈసారి మాత్రం సీలింగ్, షెడ్యూల్డ్ ఏరియా, పీవోటీ చట్టాల పరిధిలో ఉన్న వాటిని మినహాయించారు. జిల్లాలో సాదాబైనామాలకు వచ్చిన దరఖాస్తులలో పీవోటికి సంబంధించినవే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. భూ భారతిలో పీవోటీలకు సాదాబైనామా చేయకపోతే అనేక దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉండనున్నాయి. కాగా, సాదాబైనామాలకు సంబంధించి నోటీసులను ఆర్‌డీవో జారీ చేయనున్నారు. అఫిడవిట్ స్వీకరించిన తర్వాత ఆర్‌డీవోనే స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా సాదాబైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్రయవిక్రయాలు పక్కాగా జరిగితేనే చట్టబద్ధత కల్పించాలని కోరుతున్నారు.

సరైన నిర్ణయం



సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంది. పట్టాలు లేక రుణాలు దక్కలేవు. పెట్టుబడి సాయం కూడా నిలిచిపోయింది. ఇప్పుడు అన్ని సౌకర్యాలు లభిస్తాయి. – బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

రైతులకు మేలు



సాదాబైనామాలకు పట్టాలు జారీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. గ్రామాల్లో అనేక మంది భూములను రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కాగితాలపైనే రాసుకున్నారు. అలాంటి వాటికి పట్టాలు ఇవ్వనుండడం మంచి విషయం. – గడ్డం లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

త్వరితగతిన పరిష్కారం

సాదాబైనామా దరఖాస్తులు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాంటి సమస్యలేని దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం లభించనుంది. చట్టపరమైన చిక్కులుంటే మాత్రం పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. లేదా తిరస్కరించే అవకాశం ఉంది. – కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

న్యాయవ్యవస్థలో న్యాయవాదులదే కీలకపాత్ర

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి
- నిజామాబాద్ బార్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఖలీల్‌వాడి: న్యాయవ్యవస్థలో న్యాయవాదులదే కీలకపాత్ర అని, న్యాయవ్యవస్థ సక్రమంగా విధులు నిర్వహించడానికి బార్ అండ్ బెంచ్ ప్రధాన పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎస్ భరతలక్ష్మి అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలోగల పీపీ గంగారెడ్డి మెమోరియల్ హాల్‌లో శుక్రవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కోర్టుకు వాహనాల రద్దీ, కక్షిదారుల రాకపోకలు పెరిగినందున మరింత ఖాళీ స్థలం కావలసిన అవసరం ఉన్నదని, ఈ విషయమై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో మాట్లాడామన్నారు. తన పదవీకాలంలో బార్ సంపూర్ణ సహాయ, సహకారాలు అందించాలని తెలిపారు. బార్ అధ్యక్షుడు మామిల్ల సాయరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కోర్టులో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే పెద్దలు జడ్జి గారేనన్నారు. బార్ అండ్ బెంచ్ సంబంధాలలో నూతన అధ్యాయం లిఖించడానికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం బార్ అధ్యక్షుడు సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజ్, ఉపాధ్యక్షుడు దిలీప్, సురేష్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు తదితరులకు ధ్రువపత్రాలు అందజేశారు. అంతకుముందు నిజామాబాద్ అదనపు(మహిళ కోర్టు) జిల్లా జడ్జిగా నియమితులైన హరీష, సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చిన ఉదయ భాస్కర్ రావు, సాయిసుధలకు బార్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, ఆశాలత, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ్, గోపీకృష్ణ, శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మి

దోమల నివారణే మనందరి లక్ష్యం

నిజామాబాద్ నాగారం: దోమల నివారణే మనందరి లక్ష్యమని, దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు లాంటి వ్యాధులను అరికట్టాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సిబ్బందికి సూచించారు. నగరంలోని దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆశాలు, ఏఎన్‌ఎంలు ప్రతి రోజు గృహ సందర్శనలో ఏ రకమైన జ్వరం అయినా రక్తనమూనాలు సేకరించి, మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. జిల్లా కీటకజనీత వ్యాధుల నియంత్రణ అధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా ఒక్క మలేరియా కేసు నమోదు కాలేదని, మ లేరియా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యాధికారులు శ్రీలత, సుసేన, శిఖరా, చంద్రకళ, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, మహమ్మద్ సలీం, గోవర్ధన్, నటరాజ్, సంతోష్, లింగారెడ్డి, నాగరాజు, శాంతా కుమారి, స్వామి, మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

గిరిరాజ్ కళాశాలకు అవార్డు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు 'ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ' ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2025–26 విద్యా సంవత్సరానికి అవార్డు లభించింది. ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ప్రమాణాలతో 5వ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

వరంగల్ సభ తెలంగాణ ప్రజల ఆకాంక్ష



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, పక్కన రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ మేయర్ నీతూకిరణ్

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిలబెడుతుందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న నిర్వహించే సభకు ఉమ్మడి జిల్లా నుంచి 2,400 వాహనాలు, సుమారు 40 వేల మంది ప్రజలు తరలిరానున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా వివిధ గ్రామాల నుంచి 250 ఆర్టీసీ బస్సు లు, 264 ప్రైవేట్ బస్సులు, 626 ట్యాక్సీలు, 1,266 కార్లలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వాహనాలను తెప్పిస్తున్నామన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లక్షలాది మంది ప్రజల మధ్య నుంచి డిమాండ్ చేసేందుకు వరంగల్ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం అడిగినందుకు భీమ్‌గల్‌లో 33 మందిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో సంక్షేమం జరిగితే, రేవంత్‌రెడ్డి పాలనలో విధ్వంసం జరిగిందన్నారు. అనంతరం రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. తెలంగాణలో దోచుకొని ఢిల్లీకి మూటలు పంపుతున్నారన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్, సత్య ప్రకాష్, సిర్ప రాజు, సుజీత్ ఠాకూర్, మాజీ జెడ్పీటీసీలు జగన్, గడ్డం సుమన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

1 నుంచి తెయూ ప్రీపీహెచ్‌డీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ప్రీపీహెచ్‌డీ బయోటెక్నాలజీ, కామర్స్, తెలుగు రెగ్యులర్/ బ్యాక్‌లాగ్ పరీక్షలు మే 1 నుంచి 3వరకు జరుగుతాయని కంట్రోలర్ కె సంపత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పీజీ ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్ 8వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలకు 74మందికి 74మంది విద్యార్థులు హాజరయ్యారు. కంట్రోలర్ కె సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

హోంగార్డుల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్‌లో హోంగార్డులు బదిలీ అయ్యారు. జిల్లాకు చెందిన 38 మంది హోంగార్డులను డ్రా పద్ధతిలో బదిలీ చేశారు. నిజామాబాద్ నుంచి కామారెడ్డికి 38 మంది బదిలీపై వెళ్తుండగా కామారెడ్డి నుంచి జిల్లాకు 38 మంది రానున్నారు. ప్రతి ఏడాది హోంగార్డులకు బదిలీలు జరుగుతాయి.

అ'పూర్వ' సమ్మేళనం



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1999–2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రెంజల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి బోధన్ కోర్టు అదనపు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గురువారం సాయంత్రం సాటాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరికి రెండు రోజుల జైలు విధించినట్లు తెలిపారు.


రజతోత్సవ సభకు
ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. • జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్: మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్: ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్–దేవునూరు – దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు

సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

అప్పు తీర్చడం లేదని వాహనానికి నిప్పు

- ధాన్యం కుప్పకు సైతం నిప్పంటించిన అల్లుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అత్తింటివారు



కాలిపోయిన ఎక్సెల్ వాహనం

నాగిరెడ్డిపేట: అత్తింటివారు తీసుకున్న అప్పు తీర్చడంలేదనే కారణంతో అర్ధరాత్రి వేళ తన మామకు చెందిన టీవీఎస్ ఎక్సెల్ వాహనానికి నిప్పు పెట్టాడో అల్లుడు. అంతటితో ఆగకుండా ధాన్యం కుప్పను సైతం తగలబెట్టడానికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాసానిపల్లి గ్రామానికి చెందిన చాకలి బాలమణి, సాయిలు దంపతులు తమ కూతురును మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా అవసరాల నిమిత్తం సాయిలు తన అల్లుడు వద్ద రూ. 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో అల్లుడు బాలకృష్ణ.. తన భార్యను కొన్నాళ్ల క్రితం పుట్టింటి వద్ద వదిలి వెళ్లాడు. ఈనెల 23న మాసానిపల్లికి వెళ్లి భార్యను తీసుకెళ్లాడు. అత్తింటివారు తీసుకున్న అప్పు చెల్లించడం లేదన్న కోపంతో గురువారం అర్ధరాత్రి మాసానిపల్లికి వెళ్లి తన మామకు చెందిన టీవీఎస్ ఎక్సెల్‌కు నిప్పుపెట్టాడు. దీంతో పాటు గ్రామశివారులోని ధాన్యంకుప్పకు సైతం నిప్పంటించాడు. ఎక్సెల్ వాహనం పూర్తిగా కాలిపోగా.. ధాన్యం కుప్ప పాక్షికంగా కాలిపోయింది. ఈ విషయమై చాకలి బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.


ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే సమ్మర్ క్యాంప్

- సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే ఫ్రీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీవీఆర్ఆర్ స్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మే 2 వరకు నిర్వహించే ఫ్రీ సమ్మర్ క్యాంప్‌ను సీపీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాల చదువులకు సమ్మర్ క్యాంప్‌లకు చాలా తేడా ఉంటుందన్నారు. ఈ క్యాంప్‌లో విద్యార్థినులు ఎలా ఉండాలి, ఎలా చదువు కోవాలి, ఎలా భవిష్యత్తులో ముందుకెళ్లాలి, సమస్యలు ఉంటే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై క్లుప్తంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు సెల్ఫ్ మోటివేషన్ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రైయినీ ఐపీఎస్ సాయి కిరణ్ పత్తిపాక, సౌత్ రూరల్ సీఐ ఎస్ సురేశ్ కుమార్, యోగా మాస్టర్ జె. కిషన్, తైక్వాండో ట్రైయినర్ మనోజ్, రూరల్ పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ సాయిచైతన్య



ప్లీజ్ ఒక్క క్షణం..

గతేడాది ఖానాపూర్‌కు చెందిన గౌతం కాంబ్లే(28) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి బాగాలేక, ఆస్పత్రిలో చూపించేందుకు డబ్బులు లేవని మానసిక వేదనకు గురై క్షణికావేశంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైవేట్ పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్న గౌతం మృతితో తల్లిదండ్రులకు తీరని శోకమే మిగిలింది.

రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన ఆకాశ్(24) అనే యువకుడు స్థానికంగా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆకాశ్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడి రూ. ఐదు లక్షల వరకు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులు ఏమంటారో అనే భయంతో ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతితో కుటుంబం కోలుకోవడం లేదు.

- ఆత్మహత్యలు వద్దు.. జీవితమే ముద్దు
- సర్దుబాటు తత్వంతో ముందుకు సాగితేనే జీవితం ఆనందం

నిజామాబాద్ రూరల్: జీవించి సాధించాల్సింది.. కుంగుబాటుకు గురై పలువురు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. యుక్తవయసులో ఉన్నవారు సైతం బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. జీవితంలో ఎదురైన సమస్యలకు భయపడి.. నిరాశ, నిస్పృహలతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఆపై మనోవేదనతో ప్రాణాలు తీసుకుని.. నిండు జీవితాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. అందుకే మనుషులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని మానసిక వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. నిత్యజీవితంలో ఎదురైన సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోవాలని, సర్దుబాటుతత్వంతో ముందుకు సాగితే జీవితం ఆనందంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లలతో ఫ్రెండ్లీగా ఉంటేనే..

యుక్త వయస్సుకు వచ్చిన పిల్లలతో తల్లిదండ్రులు ఫ్రెండ్లీగా ఉండటమే మంచిది. వారిపై ఎక్కువగా కోపం కన్నా ప్రేమ చూపిస్తే చేసిన తప్పును వెంటనే చెబుతారు. దీంతో సమస్య పరిష్కారమవుతుంది. చేసిన తప్పును పదే పదే వారిపై విరుచుకుపడితే మనస్థాపనకు గురై ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉంటుంది. దురాలవాట్లకు గురయ్యే పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ ఉండటమే మంచిది. కుటుంబం గురించి.. తల్లిదండ్రులు పడుతున్న బాధలను పిల్లలకు తెలియజేస్తేనే వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

వేగంగా డబ్బులు సంపాదించాలని ఆశతో యువత చెడు మార్గాల వైపు వెళ్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆన్‌లైన్ గేమ్‌లతో చాలా మంది యువత నష్ట పోతున్నారు. విద్యార్థులు, యువత తల్లిదండ్రులు పడుతున్న బాధను అర్థం చేసుకోవాలి. అందమైన జీవితాన్ని క్షణికావేశంలో నాశనం చేసుకోకూడదు.

– డాక్టర్ విశాల్, ప్రముఖ సైకాలజిస్టు

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

యుక్త వయస్సు వచ్చిన యువకులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి. వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రమశిక్షణతోపాటు మంచి అలవాట్లను నేర్పించాలి. జీవితంలో వచ్చే అటుపోట్లను ఎలా ఎదుర్కోవాలో వివరించాలి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.

– ఆనంద్‌సాగర్, ఎస్సై–2, రూరల్ పీఎస్

నూరేళ్లు నిండాయా నాని

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు
- చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి
- చేరదీసి బాగోగులు చూసిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు



నాని(ఫైల్)

మాక్లూర్: విధి ఆడిన వింత నాటకంలో ఓ అనాథ ఓడిపోయాడు. చిన్ననాడే తల్లితండ్రుల మృతి.. నా అనుకున్న వారు ఎవరూ లేక పోవడం.. కనీసం పేరు కూడా లేని ఓ యువకుడిని విధి వంచించి గ్రామానికే తీరని శోకాన్ని మిగిల్చింది. మాక్లూర్ మండలం గుంజ్లి గ్రామానికి చెందిన కుర్మ రాజన్న, రంజిని బాయిలు 20 ఏళ్ల క్రితం చనిపోయారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. బాబు చిన్నతంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో గ్రామంలో ఆ బాబు ఒంటరిగా తిరగడం.. ఆకలికి అలమటించడాన్ని గుర్తించిన గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. అతనికి పేరు కూడా లేకపోవడంతో నాని(21)గా పేరు పెట్టి బాగోగులు చూసుకున్నారు. స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదివాడు. చదువుకు కావాల్సిన పుస్తకాలు, దుస్తులు, ఆహారం ఇలా ఏదైనా గ్రామంలోని ప్రతి ఒక్కరూ నానిని బాగా చూసుకునేవారు. చదువుకున్న పాఠశాలలో సైతం ఉపాధ్యాయులు నానిని బాగా చూసుకునేవారు. బదిలీపై వెళ్లినా గ్రామస్తుల ద్వారా అతని బాగోగులు చూసేవారు. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్తానని నాని చెప్పడంతో ఓ ఉపాధ్యాయురాలు అతనికి కావాల్సిన నగదు, ఇతర సౌకర్యాలు కల్పించింది. అక్కడ కంపెనీ మూతపడడంతో పెద్దగా సంపాదన లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. గ్రామంలోనే సంపాదించిన కొద్దిపాటి నగదుతో ఓ ఇంటిని కొనుగోలు చేసి అందులో నివసిస్తున్నాడు. పని చేయాలనే తపనతో ఫొటోగ్రఫీ నేర్చుకొని ఆ వృత్తిలో ఎదుగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం భైంసాలో ఉండే ఓ శుభకార్యానికి నాని ఫొటోలు తీయాల్సి ఉంది. దీంతో అతను గ్రామానికి చెందిన మరో వ్యక్తితో బైక్‌పై బయలుదేరాడు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై ఘటన స్థలిలోనే మృతి చెందాడు. అతని వెంట ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుంజ్లి గ్రామస్తులందరూ ఘటన స్థలానికి ఆటోల్లో బయలుదేరి బోరున విలపించారు. గ్రామంలో అందరి నోట ఉండే నాని ఇప్పుడు లేడంటు గ్రామస్తులు రోదించిన తీరు స్థానికులను కదిలించింది. తమ కడుపున పుట్టిన కుమారుడి వలే నానిని చూసుకున్నామని.. నాని నీకు నూరేళ్లు నిండాయా అంటూ మహిళలు గుండెలవిసేలా రోదించారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



బాన్సువాడ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. సీఐ అశోక్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణానికి చెందిన రాంపురం నారాయణ(65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో స్థానిక ఎల్లయ్య చెరువు కట్ట సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి



సిరికొండ: మండలంలోని పోత్నూర్ గ్రామానికి చెందిన పెరిక సాగర్(40) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. సాగర్ గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని ఎస్సై తెలిపారు. శుక్రవారం చిన్న వాల్గోట్ శివారులోని వ్యవసాయ బావిలో సాగర్ మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలకు వెళ్లి కాలు జారి బావిలో పడి మృతి చెందాడని మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం రహత్‌నగర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం తునికి ఆకు సేకరణకు వెళ్లిన ఓ మహిళపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంజుల అనే మహిళ తునికి ఆకు కోస్తుండగా ఎలుగుబంటి వెనుక నుంచి వచ్చి దాడి చేసింది. ఆమె అరుపులు వేయడంతో పరిసరాల్లో ఉన్న ఆకు తెంపేవారు రావడంతో ఎలుగుబంటి పారిపోయింది. ఆమెను మెరుగైన వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

వృద్ధురాలిని గాయపరిచి బంగారం చోరీ

నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ముగ్గురు దొంగలు బీభత్సం సృష్టించారు. మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు రాచర్ల కిష్టాబాయి మహారాష్ట్రలోని యాతాలం గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. సొంత గ్రామానికి వెళ్లేందుకు నవీపేట బస్టాండుకు వచ్చింది. మల విసర్జనకు టాయిలెట్‌కు వెళ్లగా ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఆమెను బలవంతంగా బయటకు పిలిచారు. బయటకు రాగానే ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలను లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రుద్రూర్: పొతంగల్ మండలం తిర్మలాపూర్ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హంగర్గ ఫారం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, పొతంగల్ వైపు వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

నిజామాబాద్ నాగారం: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌ను డీఎంహెచ్‌వో రాజశ్రీ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోగులకు కుట్లు వేయడం, ఇంజక్షన్లు ఇవ్వడం చూసి సదరు ఆర్ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే క్లినిక్‌ను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు రాత్రి 9:40 ప్రాంతంలో క్లినిక్‌ను సీజ్ చేశారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

మోపాల్: మండలంలోని మంచిప్పలో పెద్దమ్మ ఆలయంలో చోరీపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన సాయి కీర్తన్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు.

వడ్యాట్‌పల్లిలో రెండిళ్లలో..

మాక్లూర్: మండలంలోని వడ్యాట్‌పల్లిలో గురువారం రాత్రి దుండగులు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మీసాల లక్ష్మి, నడిపోల్ల రవీందర్‌లు రాత్రి భోజనం చేసి దాబాపై పడుకున్నారు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. మీసాల లక్ష్మి ఇంట్లో రెండు తులాల బంగారు పుస్తెలతాడు, ఏడు గ్రాముల చైన్, రూ. 50 వేల నగదు, రవీందర్ ఇంట్లో రెండు మాసాల బంగారు ఉంగరం, రూ. 30 వేల నగదును దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: మండల కేంద్రంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ నిసార్ హైమద్ గురువారం రాత్రి ఇంటికి గొళ్లెం పెట్టి దాబాపై పడుకున్నాడు. విషయం గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 37 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, రూ. 50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

లింగంపేట: మండలంలోని పొల్కంపేటకు చెందిన దామ ఎల్లయ్య(50)ను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఎల్లయ్య గురువారం సాయంత్రం నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన సూరంపల్లి యాదగిరి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపుతూ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఎల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య అక్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాటేపల్లిలో అగ్ని ప్రమాదం



పెద్దకొడప్‌గల్: పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డికి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన కాటేపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాటేపల్లి నుంచి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వరిగడ్డికి కుమ్మరి కుంట వద్ద విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు యత్నించినా అదుపులోకి రాకపోవడంతో గడ్డిని ట్రాక్టర్ నుంచి తొలగించారు.

బోర్గాం జెడ్పీహెచ్ఎస్‌లో..

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రం, పాఠశాల హెచ్ఎం శంకర్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో పాత పుస్తకాలు, పాత బెంచీలు, ఇతరాత్ర సామగ్రి కాలిపోయాయి. షాట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్లు హెచ్ఎం శంకర్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో మామిడి తోట దగ్ధం



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం పురాణిపేట్ ఆశ్రమం వద్ద ఉన్న మామిడితోటలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో చెట్లు, విద్యుత్ వైర్లు, పైప్‌లైన్‌కు, రెండు పంప్‌సెట్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. తోటలో 170 చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు తోట యజమాని రాజేశ్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు రాజేశ్ తెలిపారు.